క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



వంట గదిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి

పాకాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, వంట గదిని పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉండాలని, నాణ్యత పాటించాలని సూచించారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శివకుమార్ పాల్గొన్నారు

నేతాజీ గొప్ప పోరాటయోధుడు



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు బీజేపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. జీఎస్ మాడ వీధిలో నేతాజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నేతాజీ గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, సుబ్రమణ్య యాదవ్, జయంతి కుమార్, రవి ప్రసాద్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పాకాల: దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు ఆదిశేఖర్‌రెడ్డి, రమేష్‌కుమార్, ఈశ్వర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా

అక్కా సంక్షేమ పథకాలు అందుతున్నాయా..!

- గతంలో ఇంతలా సంక్షేమం ఎవరైనా అందించారా
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి
- 4వ డివిజనల్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు అభివాదం చేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: అక్కా జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. గత ప్రభుత్వాలు ఇన్ని పథకాలను అందించాయా.. అని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆరా తీశారు. ఆయన సోమవారం తిరుపతి 4వ డివిజన్‌లో ఆ డివిజన్ అధ్యక్షుడు చింతలచేను గోపి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న మూడేళ్ల పాలనలో అమలుచేసిన పథకాలను గడప గడపకూ వెళ్లి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ గతంలో పథకాల కోసం అధికారులు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు వలంటీర్లు ఇంటి వద్దకు అన్నీ అందజేస్తున్నారని తెలిపారు. పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. ఇంతగా మేలు చేసిన జగనన్నకు ఓటు వేసి రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న అధికారంలో ఉంటే ఇంతకు మించి సంక్షేమ పథకాలు అందజేస్తారని, జగనన్నను గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కె.ఇమామ్, శ్రీదేవి, పార్టీ నాయకులు పాముల రమేష్‌రెడ్డి, రాజ, బాబ్జి, సోము, సలామ్, కలీమ్, హరికృష్ణారెడ్డి, నాదముని, కంకనాల రమేష్, శాంతారెడ్డి, రాజేశ్వరి, శ్యామల, మునస్వామి పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ పొడిగింపు చారిత్రాత్మకం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను పదేళ్లు పొడిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం చారిత్రాత్మక నిర్ణయమని వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు కొనియాడారు. ఆయన సోమవారం దళిత నేతలతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ భావజాలంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. గిరిజన సంఘం నేత మూడే హరిచౌహాన్ నాయక్, బీసీ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు, నాయకులు నాగేంద్ర, చంద్రశేఖర్ నాయక్, బాల, రాజానాయక్, దొరస్వామి నాయక్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



మంత్రి ఆర్కే రోజా



సినీ దర్శకుడు శంకర్

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 2 కంపార్టుమెంట్లు నిండా యి. ఆదివారం అర్ధరాత్రి వరకు 72,998 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,852 మంది తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.4.51 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లున్న భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం మంత్రి ఆర్కే రోజా, సినీ డైరెక్టర్ శంకర్, నిర్మాత ఎన్వీ ప్రసాద్, మంత్రి శ్రీనివాసవేణుగోపాలకృష్ణ దర్శించుకు న్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

సవాళ్లను ఎదుర్కొనేలా సైన్స్ పరిశోధనలు

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న పెను సవాళ్లను పరిష్కరించే విధంగా సైన్స్ పరిశోధనలు నిర్వహించాలని నెల్లూరు జిల్లా విక్రమసింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా కోవిడ్‌తోపాటు అంతుచిక్కని వ్యాధులు విజృంభిస్తున్నాయని, వాటిని ఎదుర్కోవాలనే కోణంలో పరిశోధనలు చేప ట్టాలన్నారు. క్లస్టర్ వర్సిటీ వీసీ సాయిగోపాల్, బుడ్డో ల్ల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ విశ్వనాథ్, నేషనల్ వర్క్‌షాప్ కన్వీనర్ శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

చంద్రగిరి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ శిరీష ముగ్గులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం వెంకటనారాయణ చౌదరి, ఏఎస్వో స్వర్ణలత, డీటీలు మోహన్‌రెడ్డి, అమృత పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు

చంద్రగిరి: గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ముంగిళిపట్టుకు చెందిన రిటైర్డ్ టీచర్ బోయళ్ల చిరంజీవులు నాయుడు రూ.లక్ష, చంద్రగిరి రెడ్డి వీధికి చెందిన దివంగత యారాశి క్రిష్టారెడ్డి కుమారుడు ఎన్‌ఆర్‌ఐ యారాశి రాజశేఖర్ రెడ్డి రూ.లక్ష, మల్లయ్యపల్లికి చెందిన గుండ్లూరు బ్రదర్స్ రూ.50 వేలను ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డికి అందజేశారు. దాతలకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్టీవో సీతారాంరెడ్డి తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమ వారం ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ నుంచి బాలాజీ కాలనీ, గాంధీ రోడ్డు, నాలుగు కాళ్ల మండపం, మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ కాటమరాజు, సి.భాస్కర్ రెడ్డి, తిరుపతి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు, కుసుమ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

భాకరాపేట: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తుడా నిధులతో మంజూరు చేసిన 14 చెత్త సేకరణ ఆటోలను పంచాయతీలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి తీసుకొచ్చేలా ఆటోలను తయారు చేయించారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ హనుమాన్ నాయక్, సూపరింటెండెంట్ సతీష్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: ప్రజల ఫిర్యాదులను సత్వరం పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ డాక్టర్ శిరీష ఆదేశించారు. ఆమె సోమవారం తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భాగంగా డయల్ యువర్ కమిషనర్‌కు 13, స్పందనకు 16 ఫిర్యాదులు అందాయి. వాటిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి సమస్యకూ పరిష్కార మార్గాన్ని చూపాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. కార్పొరేటర్ నరసింహాచారి మాట్లాడుతూ తిరుపతి నగరంలో మరణిస్తున్న అనాథల మృతదేహాలను తరలించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ కొరమీనుగుంట దేవుడు కాలనీలో తెలుగుగంగ నీటి పైపులు వేయించాలని, అదేవిధంగా మట్టిరోడ్డు నిర్మించాలని కోరారు. ఉప కమిషనర్ చంద్రమౌళేశ్వర్ రెడ్డి, ఎస్‌ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతికి సంతాపం



మల్లికార్జున మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: మండలంలోని పనపాకం పంచాయతీ కోనంగివారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ బీసీ మండల కార్యదర్శి మల్లికార్జున (44) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని మల్లికార్జున భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శించారు. మల్లికార్జున మరణం పార్టీకి తీరని లోటన్నారు. చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అగరాలదేవారెడ్డి, ఐతేపల్లి సింగిల్‌విండో చైర్మన్ వరలక్ష్మి, పార్టీ నేతలు గోపాల్, నాగభూషణం, మాతయ్య, నాగేశ్వరరావు, మస్తాన్, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఐసీఏఐ భవన నిర్మాణానికి భూమి పూజ

తిరుపతి కల్చరల్: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి బ్రాంచి భవన నిర్మాణానికి సోమవారం కరకంబాడి రోడ్డులోని తుడా క్వార్టర్స్ సమీపంలో భూమి పూజ చేశారు. ఇందులో ఐసీఏఐ అధ్యక్షుడు డాక్టర్ దేబా షీస్ మిత్ర, ఉపాధ్యక్షుడు అనికెట్‌సునిత తలాతి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ఈ భవనం సీఏ చేయాలనే ఆంకాంక్ష కలిగి విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఐసీఏఐ సభ్యులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించే దిశగా సదస్సులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఐసీఏఐ దక్షిణ భారత దేశ కౌన్సిల్ సభ్యులు, తిరుపతి శాఖ ప్రతినిధులు జగదీష్‌కృష్ణ, రవీంద్రారెడ్డి, బాలాజి, సింహాద్రి, మధుబాబు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి కల్చరల్: మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు మబ్బు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న విక్రమ్ హోటల్ హాల్లో సోమవారం మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణను రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం ప్రారంభించారు. వెంకటరత్నం మాట్లాడుతూ సమాజ సేవ జీవిత సార్థకతకు మార్గదర్శకమన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే ట్రస్ట్ ఏర్పాటు చేశానని తెలిపారు. ఇందులో భాగంగా మహిళలకు గ్రూపుల వారీగా ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్.రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాజశేఖర్, సూర్యనారాయణ సతీమణి మబ్బు రాజ్యలక్ష్మి ట్రైనర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం ధ్వంసం

తిరుపతి మంగళం: మంగళం తిరుమలనగర్ పంచాయతీలోని కోళ్లఫారమ్ వద్ద ఉన్న కమ్యూనిటీ భవనాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని సర్పంచ్ వకుళ, వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్‌రాజు హెచ్చరించారు. స్థానికులు సమావేశం నిర్వహించుకునేందుకు 20 ఏళ్ల క్రితం కమ్యూనిటీ భవనాన్ని నిర్మించుకున్నారు. కొందరు సోమవారం దాన్ని గడ్డపారలతో ధ్వంసం చేశారు. మహిళలు వారిని అడ్డుకుని శివశంకర్‌రాజుకు సమాచారం అందించారు. ఆయన పంచాయతీ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆక్రమణదారులను అడ్డుకున్నారు. ఈ భవనం స్థానిక ప్రజల అవసరాల కోసం వినియోగించుకోవచ్చునని పంచాయతీ తీర్మానం చేసినట్లు, దాన్ని రెవెన్యూ అధికారులకు కూడా సమర్పించినట్లు శివశంకర్‌రాజు తెలిపారు.